క్లుప్తంగా

డీజే సీజ్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎలాంటి అనుమతులు లేకుండా వినాయక నిమజ్జనంలో ఏర్పాటు చేసిన ఎస్వీ డీజేను శుక్రవారం సీజ్ చేసినట్లు స్థానిక ఎస్సై రాజు తెలిపారు. వినాయక నిమజ్జనోత్సవంలో డీజేలను ఏర్పాటు చేయవద్దని ముందుగానే నిర్వాహకులకు ముందుగానే సూచించామని, అయినా గోపాల్‌పేటలో వినాయకుని నిమజ్జనోత్సంలో డీజే ఏర్పాటు చేయడంలో సీజ్ చేశామని ఆయన చెప్పారు.

ఆర్థిక చేయూత



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్ జీపీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసిన నవీన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.20 వేల నగదును మృతుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోతె సాయవ్వ, ఎంపీటీసీ రాంచందర్ రావు, ఉప సర్పంచ్ శివపాటిల్, పంచాయితీ కార్యదర్శి దేవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



గాంధారి(ఎల్లారెడ్డి): తిమ్మాపూర్ శివారులో శుక్రవారం క్షేత్ర స్థాయిలో వరి, పత్తి తదితర పంటలను పరిశీలించినట్లు ఏవో నరేష్ తెలిపారు. వరిలో కాండం తొలిచే పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. సస్య రక్షణ కోసం సంబంధిత రైతులకు సలహాలు, సూచనలు చేసినట్లు ఏవో తెలిపారు. ఏఈవో విఘ్నేష్, రైతులున్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా దేవునిపల్లి రాజం



దోమకొండ: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన దేవునిపల్లి రాజంను నియమించారు. ఈ మేరకు మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, రాజంకు శుక్రవారం నియామక పత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు ఉన్నారు.

రేషన్ డీలర్ల మండల అధ్యక్షుడిగా శెట్టిరాజు



రామారెడ్డి(ఎల్లారెడ్డి): రేషన్ డీలర్ల మండల కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రం రామారెడ్డిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా శెట్టిరాజు, సెక్రెటరీగా గిరెడ్డి గోపాల్ రెడ్డి, కోశాధికారిగా లెగల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా గంగాధర్‌లు ఎన్నికయ్యారు.

చెక్కుల పంపిణీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను జెడ్పీటీసీ కమిలి నర్సింలు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కో–ఆప్షన్ మోహినొద్దీన్, ఏఎంసీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో..



రాజంపేట: రాజంపేట మండలంలోని మౌనిక(శేర్‌శంకర్‌తండా), దివ్య(కొండాపూర్), నారాయణ(ఆర్గొండ), మంజుల(ఎల్లారెడ్డిపల్లి), లలిత(ఎల్లారెడ్డిపల్లి తండా), అనిత(ఎల్లారెడ్డిపల్లితండా)లకు శుక్రవారం ఎంపీపీ లింగాల స్వరూప ఆధ్వర్యంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. వీరందరికి కలిపి రూ.1.40లక్షలు అందజేసినట్లు ఆమె తెలిపారు. జెడ్పీటీసీ కొండహన్మండ్లు, ఎంపీటీసీ పేంటి రాజు, ఎస్ఎస్ తండా సర్పంచ్ శంకర్, నాయకులు బలరాం పాల్గొన్నారు.

నిరుపయోగంగా 'స్వచ్ఛ భారత్' రిక్షాలు

- మూలన పడేసిన పంచాయతీలు
- నీరుగారుతోన్న ప్రభుత్వ లక్ష్యం



పిట్లంలో మూలన పడేసిన స్వచ్ఛ భారత్ రిక్షాలు

పిట్లం(జుక్కల్): దేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. పరిశుభ్రమైన దేశం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రధాని దేశ ప్రజలకు సూచించారు. ఈ పథకాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలలో సంపూర్ణంగా అమలు చేయాలని పేర్కొన్నారు. దానికోసం ప్రతి రాష్ట్రంలో సీఎంలు పలు కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రం గ్రామాలలో ఉండే చెత్తను తరలించడానికి ప్రతి పంచాయతీకి స్వచ్ఛ భారత్ రిక్షాలు అందజేసింది. పారిశుధ్య కార్మికులు వీధులను శుభ్రం చేసి పోగైన చెత్తను తీసుకెళ్లడానికి, కాలనీలలో తిరిగి ఇళ్లలో ఉన్న చెత్తను తీసుకెళ్లడానికి రిక్షాలు పంపిణీ చేశారు. పిట్లం మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు 40 రిక్షాలు, పిట్లం గ్రామ పంచాయతీకి 12 రిక్షాలను పంపిణీ చేయగా వారు కొన్ని రోజులు రిక్షాలను వాడి తర్వాత మూలన పడేశారు. అంతేగాక కొన్ని గ్రామాలలో రిక్షాలను మురికి, చెత్త చెదారం ఉన్న ప్రాంతాలలో వదిలేశారు. ప్రధాని దేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న నినాదం ఇలా మురికి గుంతల పాలవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు పనులకు ఉపయోగిస్తే రిక్షాలు బాగుంటాయని, లేదంటే అవి తుప్పు పట్టి పనికి రాకుండా పోతయానే విషయం అధికారులకు తెలియదా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇకనైన అధికారులు మేల్కొని చెత్త ట్రాక్టర్లు నడవని కాలనీలలో రిక్షాలను వాడుకలోనికి తీసుక రావాలని ప్రజలు కోరుతున్నారు.

జీపీలు పక్కన పెట్టేశాయ్



కొన్నేళ్లనుంచి మూలన పడేయడంతో రిక్షాలు పాడైపోతున్నాయి. మా కాలనీలో విశాలమైన రోడ్డు లేక పలు ఇళ్ల వద్దకు చెత్త ట్రాక్టర్లు రావు. దీంతో ట్రాక్టర్ వద్దకే చెత్తను తీసుకెళ్లి వేయాల్సి వస్తోంది. ట్రాక్టర్లు తిరగని కాలనీలలో చెత్త రిక్షాలను వాడితే బాగుంటుంది.

– వసీం, పిట్లం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, సిబ్బంది

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ప్రతి ఒక్కరు వారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తడి, పొడి చెత్తను వేరుగా చేసి మున్సిపల్ వాహనానికి అందించాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మెప్మా సిబ్బంది తదితరులున్నారు.

పలు గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే

పిట్లం(జుక్కల్): కారేగాంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ..సీజనల్ వ్యాధులు దరిచేరకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అదే విధంగా రాంపూర్‌లో సర్పంచ్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లి, బొల్లారం గ్రామాలలో శుక్రవారం ఎంపీడీవో, ఎంపీవో శ్రీనివాస్ ఫ్రైడే డ్రైడే కార్యాక్రమాలను వేర్వేరుగా నిర్వహించారు. వారివెంట జప్తిజాన్కంపల్లి సర్పంచ్ దేశబోయిన సాయిలు, పంచాయతీ కార్యదర్శులు ప్రదీప్, సంతోష్ తదితరులున్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): క్రిష్ణాజీవాడిలో శుక్రవారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రోగాలు రాకుండా ముందుగానే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించారు.

ఇసుక డంపులను సీజ్ చేయాలి



బాన్సువాడ: మంజీర పరివాహక ప్రాంతంలో ఉన్న ఇసుక డంపులను వెంటనే సీజ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాన్సువాడ ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజీర పరివాహక ప్రాంతంలో ఇసుక డంపు చేసి అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్నారు. నాయకులు ఖాలేక్, అలీ బిన్ అబ్దుల్లా, మంత్రి గణేష్, వెంకట్‌రెడ్డి, బండి సాయిలు, పర్వారెడ్డి, తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి

బాన్సువాడ రూరల్: కాంగ్రెస్ పార్టీని ఆదరించి రానున్న ఎన్నికల్లో గెలిపించాలని టీపీసీసీ సభ్యులు కాసుల బాలరాజు అన్నారు. శుక్రవారం బోర్లంలో గ్యారంటీ పథకాలపై ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఏకకాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ, రైతులతో పాటు కౌలు రైతులకు, రైతుకూలీలకు ప్రతిపంటకు సాయం అందిస్తామన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షులు బట్టి శేఖర్, పర్వంరెడ్డి, రూప్‌సింగ్, సతీష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు మంచి ఆహారం తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో, సర్పంచ్, టీచర్లు

మద్నూర్(జుక్కల్): మహిళలు మంచి ఆహారం తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు దరిచేరవని ఐసీడీఎస్ సీడీపీవో సునంద సూచించారు. పోషణ సంబరాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడి కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీడీపీవో సునంద పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం తదితర అంశాల గురించి ఆమె వివరించారు. సర్పంచ్ సురేష్, ఎంపీటీసీ సంగీత, సూపర్‌వైజర్‌లు కొమరవ్వ, కవిత, తదితరులున్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): స్త్రీనిధి రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం రాజిరెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో వీవోఏల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్యాంక్ రుణాలు, ఎస్‌హెచ్‌జీ అకౌంటింగ్, ఎంటర్‌ప్రైజెస్, ఫిష్ పాండ్ తదితర అంశాలపై చర్చించారు. టీజీబీ మేనేజర్లు వేణు ప్రసాద్, అశోక్ రెడ్డి, శ్రీజత, సదాశివనగర్, లింగంపేట్ ఏపీఎంలు రాజిరెడ్డి, శ్రీనివాస్, సీసీలు లింగం, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై..

జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం పలువురు ప్రముఖులు గణేశ్ మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి బప్ప మోరియా..బై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై అంటూ నామస్మరణలతో మండపాలు మారుమ్రోగాయి. తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. అలాగే కొన్నిచోట్ల అన్నదానాలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



భిక్కనూరులో పూజలు చేస్తున్న మహిళలు



గాంధారిలో పూజలు చేస్తున్న తహసీల్దార్ జానకి, సీఐ రామన్, తదితరులు

నిధులు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదు



రామారెడ్డి(ఎల్లారెడ్డి): గ్రామ పంచాయతీకి ఎస్ఎఫ్‌సీ నిధులు సంవత్సరం నుంచి విడుదల కాకపోవడంతో పెండింగ్ పనులు చేయలేకపోతున్నామని పోసానిపేట సర్పంచు మహేందర్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ..నిధులు లేక ఒక ఏడాది నుంచి జీపీలో ఏ పనులు చేయకుండా ఉన్నామని, ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం తప్ప నిధుల మంజూరు చేయడం లేదని ఆరోపించారు. చేసిన పనులకు నిధులు మంజూరు కాక కొందరు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. ఆత్మహత్యలు చేసుకున్న సర్పంచులకు రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తం

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని జెడ్పీటీసీ కమిలి నర్సింలు సూచించారు. శుక్రవారం ధర్మారావ్‌పేట్‌లో గ్రామ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించడానికి కృషి చేయాలన్నారు. జెడ్పీ కో–ఆప్షన్ సయ్యద్ మోహినొద్దిన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సర్పంచ్ బడాల భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫిజియోథెరపి చికిత్స

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం ఫిజియోథెరపి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కమల్ కిషోర్ మాట్లాడుతూ.. తెలంగాణ సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి 10 మంది దివ్యాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉపాధ్యాయులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఆవిష్కరణకు ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: మధ్యప్రదేశ్ రాష్ట్రం ఓంకారేశ్వర్ జ్యోతిర్లింగ క్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన ఏక్తా ధామ్ జగద్గురువు ఆది శంకరాచార్య 108 అడుగుల విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవానికి కామారెడ్డికి చెందిన శ్రీరామ జపలిఖిత ప్రచారకుడు కృష్ణానంద స్వామి ఆహ్వానితునిగా హాజరయ్యారు. శంకరచార్యుల వారి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవం గురువారం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మద్నూర్(జుక్కల్): గ్రామాలలో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సంగమేశ్వర్ పేర్కొన్నారు. కోడిచిరలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ, జిల్లా గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి సంతోష్, సర్పంచ్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కంటి పరీక్షలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): విద్యార్థులు కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని కంటి వైద్యులు హరికిషన్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి కంటి శుభ్రతపై అవగాహన కల్పించారు. కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందజేశారు. ఆర్‌బీఎస్‌కే వైద్యులు అర్జున్, సిబ్బంది యాదగిరి గౌడ్, సిద్ధిరామ గౌడ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

నిజాంసాగర్/పిట్లం: నిజాంసాగర్‌లో స్థానిక తహసీల్ కార్యాలయం ఎదుట, పిట్లంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీల నిర్వాహకులు, కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేయకుండా ఆందోళన చేశారు. మధ్యాహ్న భోజన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, జీవో–8 ప్రకారం పెరిగిన వేతనాలను ఏరియర్స్‌తో సహా చెల్లించాలని డిమాండ్ చేశారు.

వినాయక మండపాలకు లడ్డూల పంపిణీ

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్టించిన వినాయక విగ్రహాల వద్ద బీజేపీ నాయకులు లడ్డూలను పంపిణీ చేశారు. కల్కినగర్‌లోని వినాయక మండప నిర్వాహకులకు బీజేపీ నేత వెంకటేశం లడ్డూలను అందజేశారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



మోకాళ్లపై కూర్చుని అంగన్‌వాడీలు శుక్రవారం వినూత్నంగా నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సంఘం నేతలు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెన్షన్, ఈఎస్ఐ కల్పించాలని కోరారు. సమ్మె నోటీసులో తెలియజేసిన ఇతర డిమాండ్లను నెరవేర్చాలన్నారు. అప్పటి వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు. పలువురు సంఘీభావం తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



అధికారంలోకి వస్తే ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు



కాంగ్రెస్‌లో చేరిన వారితో షబ్బీర్ అలీ



దోమకొండలో మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నేతల

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

దోమకొండ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం నాగారపు పాండికి చెందిన పలువురు సభ్యులు, యువకులు షబ్బీర్ అలీ నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లకు అండగా ఉంటుందన్నారు. రాబోయే కాంగ్రెస్ మేనిఫెస్టోలో కార్పొరేషన్ అంశాన్ని చేరుస్తామని వారికి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జనాభా ప్రాతిపదికన ముదిరాజ్‌లు ముందుండగా, రాజకీయంగా వెనుకబడ్డారన్నారు. ముదిరాజ్‌లు ఏకమై కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, నాయకులు సీతారాం మధు, రామస్వామిగౌడ్, తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరామని చెప్పడం అవాస్తవం

దోమకొండ: దోమకొండకు చెందిన ముదిరాజ్ కులస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారని చెప్పడం అవాస్తమని ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పున్న లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం శివరాంమందిర్‌లో సంఘం ప్రతినిధులు మాట్లాడారు. బుధవారం కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు ముదిరాజ్ కులస్తులను షబ్బీర్‌అలీ వద్దకు తీసుకెళ్లి మాట్లాడించి పార్టీలో చేరినట్లు చెప్పారని దాంట్లో వాస్తవం లేదన్నారు. ముదిరాజ్‌లు ఏ పార్టీలో చేరలేదని వివరించారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ ఉదయ్‌రెడ్డి



పెద్దకొడప్‌గల్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్సై కోనా రెడ్డి

మాచారెడ్డి: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి డీఎస్పీ ఉదయ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాత్రి చుక్కాపూర్లో నిర్వహించిన నేరాల నియంత్రణ– ప్రజలకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ మధ్య సైబర్ నేరగాళ్ల ఆగడాలు ఎక్కువయ్యాయని వారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉచితాలకు ఆశపడి మోసపోవద్దని, సామాజిక మధ్యమాలలో ప్రకటనలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులను నమ్మొద్దన్నారు. సెల్ ఫోన్లు పోయిన వెంటనే ఐఎంఈఐ నెంబర్ తీసుకుపోయి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సీఐ శ్రీనివాస్,ఎస్సై శ్రీనివాస్ గౌడ్, ఎంపీటీసీ రూపా దేవి, ఉప సర్పంచ్ లాస్య గ్రామస్తులు ఉన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): సైబర్ నేరాలు పెరుగుతున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కోనారెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ వద్ద ఎస్సై కోనా రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

అటవీ సంపదను రక్షించాలి

మాచారెడ్డి: అటవీ సంపదను ప్రతి ఒక్కరు సంరక్షించాలని ఫారెస్ట్ రేంజ్ అధికారిణి దివ్య అన్నారు. శుక్రవారం ఎల్లంపేటలో పోడు భూములు, అటవీ సంపద పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోడు పేరిట అడవిని నరకవద్దని సూచించారు. అడవులు అంతరించిపోతే మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని గుర్తు చేశారు. అటవీ సంపదను పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు. అడవులను నరికితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ రేంజి అధికారి రమేశ్, సెక్షన్ అధికారి శంకర్, బీట్ అధికారి ప్రశాంత్ ఉన్నారు.

'ఎస్సీ వర్గీకరణ చేయాలి'

కామారెడ్డి టౌన్: ఎస్సీ వర్గీకరణ కోసం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలని ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. 20 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఎస్సీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాదిగ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి శివకుమార్, ఎంఎస్‌పీ నాయకులు పురుషోత్తం, లక్ష్మి, ప్రభాకర్, విజయ్, రామకృష్ణయ్య తదితరులున్నారు.

గ్రామంలో సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేయొద్దు



లచ్చన్‌లో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మద్నూర్(జుక్కల్): మా గ్రామంలో సెల్‌ఫోన్ టవర్ పెట్టవద్దని లచ్చన్ గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం స్థానిక తహసీల్ కార్యాలయానికి తరలివచ్చి వినతి పత్రం అందించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా ప్రైవేటు నెట్‌వర్క్ వాళ్ల సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు కోసం నిర్మాణం చేపడుతున్నారని వారు అన్నారు. పాఠశాలకు దగ్గరలో, ఊర్లో సెల్‌ఫోన్ టవర్‌తో రేడియేషన్ ఇబ్బందులు ఉంటాయని, కావాలంటే ఊరి బయట ప్రభుత్వ స్థలంలో టవర్ నిర్మించుకోవాలని వారు పేర్కొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై ప్రభాకర్



ఫోన్‌ను అందిస్తున్న ఎస్సై గణేష్

లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన మార్గం విష్ణుకు శుక్రవారం ఎస్సై ప్రభాకర్ సెల్‌ఫోన్ అప్పగించారు. విష్ణు, సెల్ ఫోన్ కొద్ది రోజుల క్రితం చోరీకి గురైంది. విషయాన్ని బాధితుడు లింగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: సెల్ ఫోన్లను పోగొట్టుకున్న వారు ఆన్‌లైన్‌లో సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలని ఎస్సై గణేష్ అన్నారు. మౌలాన్‌ఖేడ్ గ్రామానికి చెందిన భూమేష్ పోగొట్టుకున్న ఫోన్‌ను పోలీసులు రికవరీ చేసి అప్పగించారు.

సమాచారం..

25న శ్రీరాధాష్టమి ఉత్సవం

కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈనెల 25న స్థానిక సెంటర్‌లో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు శ్రీరాధాష్టమి ఉత్సవం నిర్వహించనున్నట్లు ఇస్కాన్ ప్రతినిధి వెంకటదాస్ తెలిపారు.

నేడు మోడల్ స్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు.